# విధురరథ

ఎం. వి. యస్. ప్రకాశరావు

"తల్లి దండ్రిమీద దయలేని పుత్రుండు, పుట్టనేమి వాడు గిట్టనేమి?... పుట్టలోన చెదలు పుట్టవా గిట్టవా? విశ్వదాభిరామ వినర వేమ!" ప్రక్కింటి రామనాధంగారబ్బాయి గట్టిగా చదువుతున్నాడు పద్యం. అప్పుడే సంధ్యా వందనం ముగించుకుని హాలులో అడుగుపెట్టిన శాస్త్రిగారా పద్యం విని, నిర్జీవులై సోఫాలో చతికిలబడ్డారు. ఆయన మనస్సులో కల్లోలం రేగింది. గిర్రున కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి. కన్నీళ్ళు తుడుచుకొనకుండానే కిటికీలోంచి చూశారు. . గుత్తులు గుత్తులుగా విరియబూచిన వేపచెట్టు కనుపించింది. వేపపూల పరిమళాన్ని గాలి అంతటా విరజిమ్ముతోంది.

"పుట్టలోన జెదలు పుట్టవా గిట్టవా. . ." ప్రక్కింటబ్బాయి పద్యంబట్టీపడుతూనేవున్నాడు. గాలిలో కదులుతూన్న చెట్టుమీద పువ్వులన్నీ, పుట్టవయిన జెదల్లా మెదులుతున్నట్లు అను కున్నారు. ఎదురుగా గోడమీద వ్రేళ్ళాడుతున్న శంకరం. ఫోటో మీదకు ఆయన దృష్టి మళ్ళింది. ఫోటోలో తమవైపే చూస్తూ నవ్వుతున్నాడు శంకరం.

హ్హ — శంకరం. . నవ్వుతాడు — నవ్వడూ మరి? నవ్వకేం చేస్తాడు? తమ బ్రతుకు బజారులో కలిపి నవ్వులపాలే చేశాడు ఆఖరికి. చిన్నప్పటినుంచీ అంతే. తమ మాటంటేనే నవ్వులాట వాడికి.

"వూ తల్లి తండ్రిమీద. . దయలేని పుత్రుండు. . ఆఁ పుట్టనేమి — వాడు, వూ— గిట్టనేమి. . . ఇ — గిట్టనేమి. . వూ పుట్ట —లోన—జె. .జె"! నిద్దరొస్తున్నా, పక్కింట బ్బాయి పద్యం మానటంలేదు. శాస్త్రిగార్కి పద్యం వింటున్నకొలదీ చిరాకు కలిగింది. ఏమిటో మనస్సులో ఆందోళన బయలుదేరింది. అప్రయత్నంగా దుఃఖం ముంచుకొస్తూంది. అతి ప్రయత్నం మీద యెలానో దుఃఖాన్ని దిగమింగుతూ శంకరం ఫోటో పట్టిపట్టి చూస్తున్నారు. నీళ్ళు నిండిన కళ్ళకు మసకమసగ్గా కనుపించుతోంది. అయితే మాత్రమేం, ఆయనకు స్వచ్ఛంగా తెలుస్తూనే వుంది. కులాసాగా కుమారుడు శంకరం నవ్వుతూనే వున్నాడు.

"ఆఁ. . పుట్టనేమి వాడు, వూ. . గిట్ట నేమి. . వూ. . గిట్టనేమి. . గిట్టలోన. . ఆఁ జెదలు. . దలు. . వూఁలు వు. . గి. . గ్గి. . ఇ" నిద్రపోతూ కూడా పద్యం వదిలేలాలేడు. తప్పులే కానీ, ఒప్పులేకానీ మొత్తానికి పద్యం వలప రిస్తూనే వున్నాడు.

పద్యం వింటున్న కొలదీ శాస్త్రిగారి దుఃఖం పదింతలై పొంగుకొచ్చింది. వాడు మాటమాటకీ తమ శంకరాన్ని శపిస్తున్నట్లు అనుపించింది. ఆయన పితృహృదయం వోర్చుకొనలేకపోయింది.

"ఛీ! వెర్రివెధవ — ఆ పద్యం చదవటం యేమిటీ?" అంటూ చీదరించుకున్నారు.

"అమంగళం ప్రతిహతమవుగాక — శంకరం చిరంజీవి — శంకరం చిరంజీవి." తమ కుమా రుడ్ని దీవించుకున్నారు.

పక్కింటి పిల్లాడి పద్యం ఆగిపోయింది. కాని శాస్త్రిగారి హృదయంలో విపరీతమయిన కల్లోలం విజృంభించింది. ఇలాంటి సమయాల్లో గీతా పారాయణం ఒక్కటే శరణ్యం. భగవద్గీతలోని పుటలు తిప్పుతున్నారు. అక్షరాలన్నీ అలుక్కు పోయి మసగ్గా కనుపించాయి. కన్నీళ్ళు తుడుచు కుని పట్టిపట్టి చదవటానికి ప్రయత్నిస్తున్నారు.

ఇంతలో గుమ్మంలో చప్పుడయితే తలెత్తి చూశారు. ఎదురుగా తమ కుమారుడు శంకర శాస్త్రి నమ్రభావంతో నిలచుని వున్నాడు. తమ కళ్ళను తామే నమ్మలేకపోయారు. తాము చూస్తున్నది కలలో కాదుకదా! రెండు కళ్ళూ నులుముకుని, తమని తాము సంభాళించుకుని, మరీ చూశారు. కాని యేమీ సందేహం లేదు. సాక్షాత్తు తమ కుమారుడు చిరంజీవి శంకరశాస్త్రే!. . .

అంతే — వెంటనే ఆయనకు గడచినదివాల్లో నడచిన తమ దుఃఖగాధ జ్ఞాపకం వచ్చింది. తమ యీ దీనావస్థకు కారకుడైన శంకరం మీద పట్ట రాని కోపం కారుమేఘంలా ఆయన హృదయం అంతా కమ్ముకుంది. కళ్ళల్లో చింతనిప్పులు రాజుకున్నాయి. మొహమంతా జేగురించింది. ఆయనలో యేదో అగ్నిపర్వతం బ్రద్దలై శరీరం కోపంతో దహించుకు పోతూ పైకుబుకుతూంది.

శాస్త్రిగార్కి తమ జీవితంలో యిలాంటి అనుభవాలు చాలా అరుదు. అవి వ్రేళ్ళమీద లెక్కబెట్టి చెప్పవచ్చు. అయినా ఆయనకవి అంతగా జ్ఞాపకం రావు. కాని యీ అనుభవానికి ముందు యీ విషయంలోనే యిలాంటి అనుభ వమే ఆయన పొందేరు. ఏది మరిచిపోయినా అది మాత్రం యెన్నటికీ మరచిపోరు, మరచి పోలేరు. మరచిపోవాలన్నా ఆ విషయం మరపుకు వస్తేగా? జరిగి మూడు సంవత్సరాలైనా ఆయనకా అనుభవం యీనాటికీ కళ్ళకు కట్టి నట్లుగా వుంటుంది. మూడు సంవత్సరాలా అంటే, తమ శంకరం పెళ్ళికి పూర్వం సంగతి:

ఆరోజు ఆదివారం. ఇక్కడే, ఇలానే కూర్చుని శాస్త్రిగారు రామాయణం చదువుకుంటున్నారు. ఇంతలో ఒకమ్మాయి వచ్చింది. ఆపాదమస్తకమూ బాగా పరిశీలనగా చూశారు. ఆశ్చర్య పోయారు. . .

అబ్బ! ఎంత అందంగా వుంది! ఆమె అందం అడవిలో పూలపొదల మాటున పడగవిప్పి నాట్య మాడే నాగుపాము. . . నిర్మల నీలాకాశంలో తేలిపోతూ, తెల్లని వెలుగులు వెదజల్లే చల్లని చంద మామ. . . నింగి నలుపులలో దాగుకుని చిన్నారి చిట్టి వెలుగులు విరజిమ్మే పంచరంగుల పసిడి చుక్క. . . ఒక్కమాటలో చెప్పాలంటే, ఏమహర్షి తపోభంగం కొరకో సృష్టిలోని సౌందర్యమంతా యేర్చి, కూర్చిన అప్సరమూర్తి.

"శంకరశాస్త్రిగారున్నారండీ?" ఆ పిల్ల ప్రశ్నతో తిరిగి శాస్త్రిగారు బాహ్యస్మృతికి వచ్చారు.

"ఆఁ....ఎవరికోసం తల్లీ?

"శంకరశాస్త్రిగారి కోసమండీ!" చిరునవ్వుతో ఆమె చెప్పిన జవాబు.

సమాధానమెంత నమ్రతగా యిచ్చింది. తాము విన్నది సంగీతమా? లేక సమాధానమా? ఆ కమ్మని కంఠస్వరానికి, తీయని కోకిల స్వరానికి తేడా తెలుస్తుందా?.... ఆమె తనకోడలై—! అబ్బే — అంత అదృష్టం కూడానా, యీ ముదనష్టపు జన్మకు.......

"రా తల్లీ! ఇలారా—సిగ్గెందుకమ్మా? అలా కుర్చీలో కూర్చో....." ఆయన చూపిన కుర్చీ

మీద ఆమె కూర్చోనకుండా నించునే వుంది.

"నాయనా, శంకరా!" కుమారుడ్ని పిలిచేరు.

"ఆఁ వస్తున్నానండీ—" మేడమీదనుంచి కొడుకు సమాధానమిచ్చాడు.

ఈ లోపుగా శాస్త్రిగారామెను కాలేజీ విషయాలేవో కనుక్కున్నారు. ఇంకా యితర విషయాలేవో అడిగేరు. అన్నిటికీ నమ్రతగా ఆమె సమాధానం యిచ్చింది. ఆయనకెంతో ముచ్చటయింది. ఆమె మాట్లాడిన దానినిబట్టి తాము వూహించినది సరిగ్గా సరిపోయింది. అంతా అనుకూలంగానే వుంది. అయితే యిక ఆమె స్థితిగతులు, వంశం తెలుసుకొనుటయే తరువాయి.

"మీది యీ వూరేనా అమ్మా?

"కాదండి. అయినా ప్రస్తుతం యీ గ్రామమేనండి'

"మీ తండ్రిగారేం చేస్తారు?"

"నాన్నగారు పోలీసు సూపరింటెండెంట్ ఉద్యోగం చేసేవారు. పెద్దవారు అవటంవల్ల పెన్షన్ పుచ్చుకుంటున్నారు."

"ఆహా......అలాగా, అయితే మీరు వైదీకులేనా తల్లీ?"

"ఉహూఁ—నియోగులం కూడా కామండీ! క్రైస్తవులం."

"ఆఁ! క్ర—క్ర—యిస్త — వులా?!" ఆశ్చర్యపోయారు.

ఒక్కసారుగా యెంతో ఆశాభంగం పొందేరు. ఏదో మహోన్నత పర్వత శిఖరాగ్రంమీద నిలచుని ప్రకృతిసౌందర్యాన్ని చూసి మురిసిపోతూ, తన్మయావస్థలో మునిగి వున్న తమని యెవరో వెనుకనుంచే వచ్చి, గభీలున భయంకరమైన అగాధంలోకి నెట్టివేసినట్లయింది. గుండెలు గుభీల్మన్నాయి. బాధతో హృదయం విలవిలా కొట్టుకుంది. తమలో దావానలంలా కోపం రగుల్కొంది. ఈర్ష్య విజృంభించింది.,...... అప్పటి మాదిరే యిప్పుడూ. ఇంతే! ఇలానే!! ఏమీ తేడా లేదు. కాళ్ళు కూడా కంపిస్తున్నాయి.

ఆ అస్పృశ్యుడదానికి ముడిగట్టి, మూడు సంవత్సరాలైపోయి, తిరిగేముఖం పెట్టుకొని ఇంటికి వచ్చినట్లు? అసలెలా రాబుద్ధివేసింది? సిగ్గూ—యెగ్గూ లేని వీడిలో చీమూ—నెత్తురూ మాత్రం యెలా వుంటాయి.? ఇహ యీ జన్మకు యింతే– వెధవది! ఈ తగులడబోయే ముందు ఒక ఉత్తరం ముక్క వ్రాసుకేడుస్తే యేం పోతుంది?....'రావద్దని' ఒక కార్డు వ్రాసి పోస్టులో పారవేసి వుందురు. అయినా యిదంతా తను వెర్రికాని యింతలోనే ముంచుకు పోయిందేమిటి? ముందు గుమ్మం దిగి మాట్లాడమంటే సరిపోదూ? కానలా చేస్తే ఏం బావుంటుంది? లేకపోతే యీ కులభ్రష్టపుకుక్కను యింట్లో పెట్టుకుని వంశానికి కళంకం తెచ్చుకుంటారా? ఛీ! వీల్లేదు? అలా ఒక్క నాటికీ జరుగదు. తను కంఠంలో ప్రాణముండగా అదెన్నటికీ జరుగనివ్వరు.

కాని, మొత్తానికి సమస్య చాలాక్లిష్టతరమైంది. అంతే కాదు. దుర్భేద్యమయింద్దనే చెప్పాలి. ఏమరుతేనేం, ఏది ఏమయినా, యెవ్వరేమనినా, ఖచ్చితంగా మరిహ తమ నిశ్చయానికి తిరుగంటూ లేదు. సామానులవీ హాల్లో చేరవేసి, బండివాడు కిరాయి తీసుకొని వెళ్ళిపోయాడు. శంకరం తండ్రిగారి దగ్గరగా వెళ్ళి నిలచున్నాడు. ఆయనకు యేదోలా వుంది. ఒళ్ళంతా ముళ్ళు గుచ్చుతున్నట్లు ఉంది. తమ తాత తండ్రుల అధికార దర్పం అడుగంటి పోతున్నట్లనిపించింది. పవిత్రమైన తమ శీలం, వంశం అన్నీ మంటకలిసి పోతున్నట్లు కనుపించింది. ఆయన వోర్చుకోలేకపోయారు. ఒక్కసారిగా ఆయన్ను అలుముకున్న ఆ వెర్రి ఆవేశంలో గట్టిగా అరచి అవతలికి పొమ్మనాలనుకున్నారు. ఇంకా యేదో చేయాలని పిడికిలి బిగించేరు. కానేం లాభం— తమ ముందు నమ్రతగా తలవంచుకొని నిలుచున్న కొడుకుని చూడగానే. ఆ కోపం అంతా సూర్యరశ్మికి కరిగిపోతున్న మంచులా కరిగి విడిపోయింది..........

అయిన సంబంధం—అయిదు ఎకరాల నలభై పుట్లు బంగారం పండే కాలువ క్రింది పల్లపు భూమి, ఆరు వేలు కట్నం, పన్నెండుపందల బాల తొడుగుతో పిల్లనిస్తామని కాళ్ళదగ్గర కొచ్చారు. బ్రతిమాలేరు. ఒక్క బ్రతిమాలటమేనా— ఆ పిల్ల తండ్రి సూరన్న పంతులు తన రెండు చేతులూ పట్టుకొని, "బావగారూ! మనం బాల్యమిత్రులం. ఈ సంబంధం అందుకోవటంతో ఆత్మ బంధువులమై సన్నిహితులం కూడా అవుతాం. మా అమ్మాయిని తమ కోడలిగా చేయాలని, మా వాళ్లంతా యెంతో ముచ్చట పడుతున్నారు." అంటూ యేమిటేమిటో చెప్పి ప్రాధేయపడ్డాడు పాపం!

"అవశ్యం అలాగే కానివ్వండి. ఈమాత్రం దానికి మీ రింతగా చెప్పాలా? మనం చిన్నప్పుడనుకున్న విషయమేగా? తథాస్తు!"

తీరా తాము వాళ్ళకు మాట యిచ్చింతరువాత 'నసేమిరా' అన్నాడు! అంతే — వ్యవహారం తల్లక్రిందులయింది. అవమానంతో తమకు తల గొట్టినంత పనయింది. నిర్దోషికి పురిశిక్ష విధించినట్లయింది. వాడిపెళ్ళి వద్దనటం, తమ మాట నిలబెట్టమని యెంతో బ్రతిమాలేరు. తమ గౌరవం గంగలో కలు వద్దని యెంతో బుజ్జగించారు. చివరకు చేసేదిలేక నెత్తీ, నోరూ మొత్తుకుని యేడ్చారు. ఉహూ — వాడు వింటేగా! . . పైగా తనకు యిష్టమైనట్టున్న పిల్ల 'ఆమె తల్లికి పెళ్ళి ఛీ! అలాంటి మాటలు పునఃశ్చరణ చేయుటుమంటే తనకు పరమ అసహ్యం. ఏం చేస్తారు — కడుపు చింపుకుంటే కాళ్ళమీద పడుతుంది. గట్టుచప్పుడు కాకుండా వాడి వాగుడు మూసివుంచబట్టే సరిపోయింది. వాళ్ళకు తెలిసినట్లయితే, నిలువునా చర్మం వలిచి బుర్ర రామకీర్తన పాడి వుండేవారు వెధవని!

ఒట్టి కుర్రకుంక — ఎవరు ఏది చెపితే అది నమ్మే స్వభావం. వీడికి బొత్తిగా మనుష్యుల వైఖరి తెలియదు. "గిట్టని వెధవలు యెవరో కల్పించి చెప్పిన కట్టుకథలు నమ్మి, బంగారంలాంటి భవిష్యత్తు గంగలో కలుపుకోవద్దురా — శూన్యమైన అపవాదులు నమ్మడం ఆత్మవినాశం కొని తెచ్చుకోవడమే అవుతుందిరా, సిరిరా మోకాలడ్డుట దౌర్భాగ్య హేతువు నాయనా!" హితోపదేశం చేశాడు. ఇంకా ఎన్నోవిధాల నచ్చచెప్పారు. కానీ వాడికి నచ్చుతేగా! తల్లిచేతకూడా చెప్పించి చూచారు. వూహూ ... వాడు వింటేనా లాభం లేకపోయింది. నయాన, భయాన, అన్నివిధాల ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆ పట్టున తమకు వెర్రెత్తుకొచ్చింది.

ఆరు నూరైనా, నూరు ఆరైనా వాడాపెళ్ళి చేసుకొనక తప్పదనీ, అలా కానిపక్షంలో యిక పైని యింట్లో వాడి మొహం తమకు కనుపించడానికి వీలులేదనికూడా అన్నమాట నిజమే. అయితే, మాత్రం తామేదో కోపంలో నోరుజారితే అన్నంత పనీ చేయాలనెక్కడుంది.? ఏమన్నుకుని ఏం ప్రయోజనం.? వూ ... ఇంతకు ఆ పాపిష్ఠిది పన్నిన పద్మవ్యూహం అలాంటిది. ఈ కుర్రకుంకను కట్టుకు పోవడానికి ఆ టెక్కులాడి కల్పించిన కట్టుకథ మాత్రమే అది. ఏమీ సందేహం లేదు. సందేహమో, చట్టుబండలో, ఏమిటో! జరుగకూడనిదేదో జరిగిపోయింది. కొంప విడిచి ఆ కిరస్తానీ దాన్ని కట్టుకుని కులభ్రష్టుడయ్యాడు. ఛండాలుడు.

నరేషయ్యా! పోయినవాడు పోక, మళ్ళీ ఎందుకూ రావటం? రావడానికి మొహమెలా చెల్లిందో? తిరిగి యిక్కడ అడుగు పెట్టడానికి ఆత్మెలా అంగీకరించిందీ అంట! వూహూ—ఆత్మ —అదే వుంటే యేవాడో బాగుపడేవాడు. అసలు వాడికి ఆత్మంటూ వుంటే కని, పెంచి, పెద్దచేసిన తల్లిదండ్రులని కాదని కాని ముండను కట్టుకుని ఎందుకు పోతాడు.?

పైగా ఏమీ ఎరుగనట్లు ఎలా నిలుచున్నాడో బుద్ధిమంతుడిలా బుర్ర వంచుక మరీ నిలుచున్నాడు. సరిగ్గా అప్పుడూ యింతే — తెల్లవారేసరికి స్కూలు పిల్లలతో పోట్లాడి ముప్ఫైమూడు తగవులు తెచ్చేవాడు. ఈ తగవులు తీర్చలేక విసుగెత్తిపోయేది.

"ఈ తగవులేమిట్రా! ఇహ వూళ్లో నన్ను తలెత్తుకు తిరుగనీయవా యేమిటి?" అని యెప్పుడయినా కాస్త మందలిస్తే, సరిగ్గా అలానే తల వంచి వేసుకునేవాడు. మరి సమాధానం వుండేది కాదు. అప్పుడూ, యిప్పుడూ యింతే. ఇక పెరిగి పెద్దవాడైనా సరే, సరి... చూసిన సినిమాలు చూడవద్దంటే తంటా — అనవసరపు ఖర్చులు తగ్గించుకొనమంటే మంట! ప్రతి చిన్న విషయానికి పేచీ, మయిగా పదేసిరోజులు తనతో మాట్లాడటం మానివేసేవాడు. ఇంట్లో తమని తప్పించుకుని మరీతిరిగేవాడు. ఏమిటో అలాంటప్పుడు ప్రాణం కొట్టుకు పోయేది. తిరిగి తామే వాడికి లొంగిపోయి బ్రతిమాలవలసిన పరిస్థితి కలిగేది. ప్రాణాలు కొరుక్కుతినేవాడు కదూ — అబ్బబ్బ!



# నేను మీ అదృష్టం చెప్పగలను

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోతున్నదిన్నీ, నీ సరియైన వర్ణన గురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయుతేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన విరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయితు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, ఆకస్మిక ద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్ట గ్రహము లేదా నా పున్న యెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూటీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మా అడ్రసు ఇంగ్లీషులో వ్రాయుండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (A. W. 13) Jullunder City.**


రీతంగా జ్వరం ముంచుకొచ్చింది. ఆ జ్వరంలో రెండు మూడుసార్లు క్రిందకి దించవలసినంత పనీ జరిగి, తిరిగి యెలాగో బ్రతికి బయటపడింది. పాపం! అది యీ నాటివరకూ సరిగ్గా సర్దుకోలేదు. ఏదో విధాన యీ మూడు సంవత్సరాలు మూడు గండాలులా గడచిపోయినవనుకుంటే, సుడిగాలిలా మళ్ళీవచ్చి పడ్డాడు. రామ, రామ! వెధవ—పుత్రుడై పుట్టి, శత్రువై సాధిస్తున్నాడు. మాని పోయిన గాయాన్ని రేపి, మరిచిపోయిన బాధల్ని తిరిగి తోడి, తమనేడిపించడానికి కాకపోతే వీడెందుకు రావడం? చ ఛ! తామంటే బొత్తిగా భయం లేకుండా పోయింది. ఇంత పెద్దవాడైనా బుద్ధి రాకపోతే యెలా తగుల బడగలడు?

"ఛీ!" తీవ్రస్వరంతో చీదరించుకున్నారు. శంకరం శాస్త్రిగారి యీ ఛీత్కారంతో హతాశుడయ్యాడు. అతనికెంతో బాధ కలిగింది, అసహ్యం వేసింది— కోపం వచ్చింది. శంకరం తండ్రి గారి ముఖంలోకి తీక్షణంగా చూశాడు—ముసురు కొని ముంచుకు వస్తున్న ముసలితనపు విషాద రేఖలు మృత్యుమందిర సోపానాల్లా కనుపించేయి. అంతే—ఆ దృశ్యం చూడగానే అతని హృదయంలో బాధ విలవిలా తన్నుకుంది. కళ్ళు నీళ్ళతో నిండేయి.

పాపం! అస్తమానూ తమ్ము గురించి ఆలోచిస్తూ బాధపడుతూ వుంటారేమో! అందుకే ఆ ఆలోచనలకు తట్టుకోలేక తలంతా ముగ్గుబుట్టలా తెల్లబడిపోయింది. మనిషి బొత్తిగా కృశించిపోయారు. ఉత్తి యెముకలు కనుపిస్తున్నాయి. ఏమిటో వయస్సు పెరుగుతున్న కొలదీ కోపం అధికమైపోతూంది. ఒట్టి చాందసుడు—లేకపోతే 'ఛీ'! అట 'ఛీ!' దీనికేమైనా అర్థం వుందా? ఏమైపోయానో, యెలా వున్నానో అని మనస్సువుండబట్టక చూడాలని వస్తే, ఇదీ వరుస—ఎందుకీ పిచ్చికోపం? దేనికీ వెర్రిపట్టుదల? ఏమిటో, తాను రాకుండా వుండినా, యీ గొడవలేకుండా వుండేది. అసలీయన పిలుస్తే మాత్రం వస్తాడా, అసలు బొత్తిగా పేడకల రాబట్టి గాని…………

అమ్మకు విపరీతమైన జబ్బు చేసినట్లూ, ఈయన రెండుచేతులతోనూ ముఖం కప్పుకుని అవురుమని యేడుస్తున్నట్లు ….చ ఛ! ఇంకా యేమిటేమిటో! సరిగ్గా జ్ఞాపకం లేదు. అందువేత ప్రాణాలు అరిచేత పట్టుకొని, ప్రయాణమై వచ్చాడు. అరె! అమ్మేది? అమ్మ కనుపించదేం? తను భోజనానికి కాస్త ఆలస్యంగా వస్తే ఆరోగ్యం పాడవుతుందని ఆరాటించిపోయేది. కాలేజీలో చదువుకునే అప్పుడు యెప్పుడయినా యెక్స్‌కర్షన్‌కు వెళితే తను తిరిగివచ్చేవరకూ వేయి దేవుళ్ళకు మొక్కుకుంటూ కొట్టుకు పోయేది అమ్మ. తన్నాలోనాడు తన తండ్రి ఇంట్లోంచి పొమ్మన్నప్పుడు గుండెలుబాదుకుంటూ యేడ్చింది. పాపం, తన తండ్రికి తెలియకుండా అయిదు వందలు రూపాయలనోట్లు కోటుజేబులో పెట్టి తన్ను దీవించి, ముద్దుపెట్టుకుని 'త్వరగా తిరిగిరా నాయనా' అంటూ కౌగిలించుకుని గొల్లుమని—యేడ్చింది వెర్రి అమ్మ. పాపం అనవసరంగా తన్ని గురించి బెంగతో సగమై వుంటుంది. ఎందుకూ, తనకేం తక్కువనీ? పిచ్చి అమ్మ! ఏమిటో!….. శంకరం రెండు కళ్ళూ నీళ్ళు కమ్మేయి, కాలర్ తడిచింది. బొటబొట భూమిమీద కారేయి.

ఆయన వూహించుకున్నారు. విక్షేపం లాంటి వీడ్ని పాడుచేసింది. మందో మాకో పెట్టి మనసు విరిచి యెలాగో లోబరచుకొంది. తమ నుంచి వేరు చేసింది. ఇప్పుడు ఆ మోజు కాస్త తీరగానే బూజు దులిపినట్లు వీడ్ని వదిలించుకొని మరొకడ్ని మరిగివుంటుంది. పాపిష్టిది! ప్రతిఫలం అనుభవించకపోదు. ఈ బ్రాహ్మణకోపం శాపమై దాన్ని చుట్టుకొనకుండా వృథాపోదు. అది సర్వనాశనమై తీరుతుంది……వీడికేమీ తెలియదు. తెల్లని వన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్ళూ అనుకుంటాడు. ఏమిటో, పాపం! ఉత్తి అమాయకుడు.

"అయినా నీకు బొత్తిగా మతిలేదురా!" అన్నారు. 'అది—అది—జాతక్కువది! తిరుగుబోతు' అనుకున్నారు. ఎంతపని జరిగిపోయింది!"

"ఛీ! అర్థంచేసుకోలేరు నన్ను." శంకరం అనుకున్నాడు. ఎంతసేపూ వేదాంతపు వెలుగు, ఆధ్యాత్మిక ఔన్నత్యం, వంశగౌరవం గురించి మాట్లాడటం తప్పితే, మానవత్వం అంటే యేమిటో బొత్తిగా తెలియదు. వంశ పారంపర్యంగా వస్తున్న ఆచారం పిశాచంలాగయన నరనరాన్నీ పట్టుకుని జీర్ణించుకుపోయింది. తాను నమ్మిన ధర్మం కొరకు గర్వంగా జీవిస్తున్నానన్నే విపరీతమైన వెర్రి అహంభావం ఈయనకు. ఏమిటో! అంతా తెలుసుండీ తానిక్కడికి రావటం బొత్తిగా బుద్ధితక్కువ…………

శంకరం ఏదో మాట్లాడాలని మెమ్మదిగా గుటక వేశాడు. ఇంతలో శంకరం తల్లి యేదో పనిమీద అక్కడకు వచ్చింది. కొడుకుని చూడగానే గొల్లున యేడుస్తూ కౌగిలించుకుంది.

ఇది చూడగానే శాస్త్రిగారి తల గిరగిరా తిరిగింది. హోమగుండపు అగ్నికీలల్లా గుండెల్లో కోప జ్వాలలు చెలరేగాయ్. పిచ్చివాడయ్యాడు.

"బుద్ధుందా లేదా, యెందుకేడుస్తావ్?" అని గర్జించేరు.

"విడువ్—వాడ్ని విడిచి ముందు లోపలకు నడు—హా……మనవాడాయి ఆవాడే….." ఆ చివరిమాట నాలిక వరకూ వచ్చి తకీమని ఆగిపోయింది. కంఠం శోకంతో రుద్ధమైంది. ఉన్మత్తుగా దండతాడిత సర్పంలా పైకి లేచి తడబడే అడుగులతో గబగబా లోపలికి వెళ్లిపోయారు.

"నా బాబువి కదూ, ఏమీ అనుకోవద్దు నాయనా! వయస్సు వచ్చేకొద్దీ ఆయన మతిపోతున్నారు. మీ నాయనగారి కోపం నీకు తెలియంది కాదుగా?" శంకరాన్ని అతని తల్లి బ్రతిమాలుతోంది.

"నీవు కాస్త ఉండమ్మా—" అని కంగారుగా తల్లి కాగిలి విడిపించుకోవబోయాడు శంకరం. కానామె శంకరాన్ని మాత్రం వదిలిపెట్టలేదు. ఎలా వదిలిపెట్టగలుగుతుంది? తను నేరక చేసిన యే పురాకృతపాపమో శాపమై తన కుమారుడ్ని ఎడబాటు చేసింది. కాని, యెన్నోపూజలు, యెన్నో వ్రతాలు చేసిన సుకృతం యీనాడు తన కుమారుడ్ని తిరిగి తన వడిలోనికి తీసుకొచ్చింది. అలాంటి తన నోములపంట, వరాలమూటను దూరంగా విసురుకొని తను జీవించగలదా? అమ్మో!……

"లేదు తండ్రీ లేదు. నీవు వెళ్ళడానికి వీల్లేదు. నిన్ను దూరం చేసుకుని కడుపుకోతతో బ్రతుకలేనురా నాయనా!" ఆమె దీనంగా రోదించింది. ఒక్కసారిగా ముంచెత్తిన ఆ మాతృప్రేమతో శంకరం నవనీతమయ్యాడు. తల్లి హృదయం తలదాచుకుని వెక్కివెక్కి యేడ్చేడు.

''నువ్వు నన్ను విడిచి యెక్కడికీ పోవమ్మా!'' గద్గద స్వరంతో తల్లిని ఓదార్చి, నెమ్మదిగా లోపలికి తీసుకు వెళ్లాడు.

గదిలో పెనుభూతం వంటి శ్మశాన నిశ్శబ్దం తాండవిస్తోంది. మూర్తీభవించిన శోకదేవతలా తన తండ్రి మోకాళ్ల మీద కూలబడి, రెండు చేతులతోనూ ముఖం కప్పుకొని యేదో భరించలేని అవ్యక్తవేదన ననుభవిస్తున్నారు. అది చూడగానే శంకరానికి దుఃఖం వుప్పెనలా పొంగుకొచ్చింది. కన్నీళ్లు గిర్రున తిరిగేయి. భరించలేని బాధతో హృదయం బరువెక్కింది. తానేం చేయాలి? తనేం చేస్తే ఆయన బాధ వుపశమిస్తుంది? అయ్యో ఆ! ఈయన్ని వోదార్చటమెలా?

కర్తవ్యం తోచరాక తుఫాన్‌లోని జీర్ణ నౌక వలె కొట్టుకుపోతున్న శంకరానికి అకస్మాత్తుగా యేదో ఆలోచన తట్టింది. సృష్టిలోని అన్ని శక్తులనూ మించిన యేదో అనిర్వచనీయమైన దివ్యశక్తి అతన్ని ముందుకు నెట్టింది.

నెమ్మదిగా తండ్రి దగ్గరగా వెళ్ళి ''నాన్నగారూ!'' పిలిచేడు.

సమాధానం లేదు.

''ఎందుకండీ అలా?''

సమాధానం రాదు.

''చూడండి—'' ఈ సారి సమాధానం కొరకు ఎదురు చూడకుండానే ఆయన రెండు భుజాలు పట్టుకొని పసిపిల్లాడిలా పైకి లేవనెత్తి తన వడిలో కూర్చోన బెట్టుకున్నాడు.

''ఛఛ! పసిపిల్లాడిలా యెందుకీ కన్నీళ్ళు?'' తన చేతి రుమాలుతో ఆయన కన్నీళ్ళు తుడిచాడు. ఆయన తలను తన భుజం మీద పెట్టుకొని ముఖానికి దగ్గరగా చేర్చుకున్నాడు.

మౌనంగా ఆయన కన్నీళ్ళు కారుస్తున్నారు.

''ఛీ! నన్ను గురించి విచారించకండీ— నాకేం తక్కువ—? ఇదిగో, మీ గురించి రెండువేల రూపాయలు పట్టుకొచ్చాను. మీకూ, అమ్మకూ బలానికి మంచి టానిక్కులు కూడా తెచ్చాను. మీకు ఇష్టమని ద్రాక్షపళ్ళు, చక్రకేళీలు, యాపిల్‌కాయలు.....అవిగో, రెండు బుట్టలు పుచ్చుకున్నాను. చూడండి. ఇకనుంచి మీరు యీ నేతబట్టలు కట్టుకోవద్దు. మీకూ అమ్మకూ కావలసినన్ని సిల్కుబట్టలు కొన్నాను. అదిగో — ఆ పెద్ద సూట్కేస్ నిండా అవే. ఈ నెలాఖరుకు మరో పదిహేనువందలు పంపుతాను. ఇకపైన మీరు పొలం పని కష్టపడి చూడొద్దు. పొలం పని ప్రత్యేకంగా రత్తయ్యకు అప్పజెపుదాం. మీరంతా పొలం వెళ్లాలనుకొంటే, ఏమయినా సరే—నడిచి మాత్రం వెళ్లొద్దు. బండి కట్టించుకు వెళ్లండి. ఇక ఇంటిపనికి మీకు వచ్చినవాణ్ణి మాట్లాడుదాం. ఇక మంచి అమ్మా, మీరూ హాయిగా పార్వతీ పరమేశ్వరుల్లా యే పురాణ కాలక్షేపమో చేస్తూ మన వేదమీద కూర్చోవటమే......'' శంకరం చెప్పటం పూర్తి కాలేదు. ఇంకా యేమో చెపుతూనే వున్నాడు.

ఒక్కొక్క కారు మేఘమే కరిగి, వర్షించి, తెల్లబడుతూన్న ఆకాశంలా ఆయన హృదయం పల్చబడి పోతూంది. గట్లు తెంపుకొన్నున్న ప్రవాహంలా ఆయన శరీరంలో అణువణువునా పుత్రప్రేమ పెల్లుబికి ఒక్కమారుగా ఆయన్ను ముంచెత్తింది. ఆపుకోలేక వుక్కిరిబిక్కిరయ్యారు. ఆ వుద్వేగంలో ''నాయనా!'' అని బిగ్గరగా అరచి గట్టిగా కొడుకును కౌగిలించుకున్నారు.

''లేని ప్రాయశ్చిత్తం చేయిస్తున్నావా—నీవెక్కడికి వెళ్లొద్దురా!'' బావురుమని విలపించేరు.

''లేదు నాన్నగారూ, మీరింకా ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలండీ!'' తల నిమురుతూ దుగ్ధతతో అన్నాడు శంకరం.

చిరకాల తపస్సుకు మెచ్చి, భగవంతుడు ప్రత్యక్షమైనప్పుడు కోరికలు మరిచి, ఆ బ్రహ్మానందంలో తన్మయురాలైన భక్తురాలిలా ఆ దృశ్యం చూస్తున్న శంకరం తల్లి యేదో మహదానందంలో మునిగి, ఉక్కిరి బిక్కిరౌతూ ఆనంద కవోష్ణ బాష్పాలను పమిట కొంగుతో అద్దుకొంటూంది.

